క్లుప్తంగా

నేడు కోటదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు


దసరా వేడుకలకు ముస్తాబైన వీరఘట్టం కోటదుర్గ ఆలయం


కోటదుర్గమ్మ

వీరఘట్టం: మండల కేంద్రంలోని కోటదుర్గ ఆలయంలో గురువారం దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా క్యూలైన్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు శర్మయాజీ చెప్పారు.

ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

● మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. వండువలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..ప్రజలందరూ సుఖ, సంతోషాలతో దసరా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజలందరిపై దుర్గమ్మ ఆశీస్సులు



పాలకొండ రూరల్: దుర్గామాత చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలవలస విక్రాంత్ ఆకాంక్షించారు. దసరా పర్వదినం సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమ్మవారి చలువతో రానున్న రోజుల్లో మంచి జరగాలన్నారు. ఆనందోత్సాహాల నడుమ కుటుంబ సభ్యులందరూ పండుగను సరదాగా జరుపుకోవాలన్నారు.

టార్పాలిన్ల పంపిణీ


టార్పాలిన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరీ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ట్స్ సంస్థ అందిస్తున్నటువంటి సబ్సిడీ వ్యవసాయ పరికరాలను రైతులందరూ ఉపయోగించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు నూక అనూప్, బెండి శంకరరావు, రవి భట్ల, సూర్యం, సుగ్రీవులు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న నందెన్న విగ్రహాలు


విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారులు

భామిని: మండలంలోని సింగిడిలో కుమ్మరి కళాకారుల చేతిలో నందెన్న విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. గౌరీపౌర్ణమి నుంచి గ్రామాల్లో సందడి నింపే నందెన్న ఉత్సవాలకు గాను నందికేశ్వరునిపై గంగా,గౌరీ సమేతుడైన శివుని విగ్రహాలు సిద్ధమవుతున్నాయి.

అటవీ ఫల సాయాలకు కేరాఫ్ వారపు సంత

గుమ్మలక్ష్మీపురం: వారపు సంతలు సీజన్‌ల వారీగా లభ్యమయ్యే అటవీ ఫలసాయాలకు చిరునామాగా చెప్పక తప్పదు. సీజన్ల వారీగా పండే అటవీ ఉత్పత్తులను పలు గ్రామాల గిరిజనులు సేకరించి వారపు సంతల వద్దకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. రసాయన ఎరువులు వాడకుండా, సహజ సిద్ధంగా దిగుబడొచ్చే ఉత్పత్తులు కావడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రతీ ఒక్కరూ ఆశక్తి కనబరుస్తుంటారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు ఉసిరి, బొప్పాయి, అరటి, కీరా, దబ్బకాయలు, కంపర దబ్బకాయలు, నిమ్మ, జామ, సీతాఫలాలు, వెదురుముంజలు, అల్లం, ఆరిక తేగలు విరివిగా తీసుకొచ్చి విక్రయించారు. వీటిని ప్రతీ వారం కొనుగోలు చేసేందుకు చిరు వ్యాపారులు సైతం ఎగబడుతునే ఉంటారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు


భామినిలో పత్తికి బదులు వేసిన మొక్కజొన్న

● ప్రత్యామ్నాయ పంటగా ఆసక్తి
● తక్కువ పెట్టుబడి – ఎక్కువ దిగుబడి


పసుకుడిలో ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు

భామిని:

పాలకొండ డివిజన్‌లో మొక్కజొన్న సాగు ప్రతి ఏడాదీ పెరుగుతోంది. ఈ ఏడాది ఘననీయంగా పంట మార్పిడి చేసిన రైతులు ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. తక్కువ వ్యయం, ఎక్కువ దిగుబడి వచ్చే మొక్కజొన్న సాగుకు రైతులు ముందుకు రావాలని వ్యవసాయధికారులు సూచిస్తున్నారు. అలాగే సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టాం మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో దిగుబడి సరాసరి ఎకరానికి 25 క్వింటాళ్ల మేర వస్తోంది. భూసారం బట్టి 20 నుంచి 30 క్వింటాళ్ల మేరకు వచ్చే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారుల ద్వారా తెలుస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు ఆశించే మొక్కజొన్నను ఏడాదికి రెండు సార్లు సాగు చేస్తున్నారు. వర్షాధారంగాను.. నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో సాగు చేస్తూ అన్నదాతలు నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండా పారిశ్రామికంగానూ వినియోగిస్తుండడంతో పంటకు డిమాండ్ నెలకొంది. ముఖ్యంగా మొక్కజొన్నను పశువులు, కోళ్ల దాణా తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

పాలకొండ నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం
భామిని	1089 ఎకరాలు
వీరఘట్టం	300
పాలకొండ	520 ఎకరాలు
సీతంపేట	210 ఎకరాలు
మొత్తం	2119 ఎకరాలు

సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

మొక్కజొన్న సాగుకు మురుగునీరు పోయే లోతైన ఎర్ర గరప, మధ్యస్త నల్ల నేలలు బాగా అనుకూలం. నేలలో తేమను పట్టి ఉంచే గుణం ఉండాలి. నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో మొక్కజొన్న దిగుబడి సరిగా రాదు. జీరో టిల్లేజ్ పద్ధతిలో పొలంలో దుక్కి లేకుండా కూడా నాటుకోవచ్చు. అలాగే పొలంలోని వరి దుబ్బులలోనే గొయ్యి తవ్వి విత్తనం వేసుకోవచ్చు. అప్పటికే పొలంలోని తేమ, ఎరువుల సత్తువతో మొలకలు బాగా వస్తాయి. దుక్కి ఖర్చు లేకుండా విత్తుకోవడంతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

విత్తనాల్లో రకాలు..

దీర్ఘకాల రకాల పంట 100 నుంచి 120 రోజులకు దిగుబడి వస్తుంది. అదే మధ్యకాలిక రకాలు 90 – 100 రోజులకు.. స్వల్పకాలిక రకాలు 90 రోజుల్లోపే పంట చేతికి వస్తుంది.

ప్రత్యమ్నాయ పంటగా ప్రోత్సాహం..



పాలకొండ డివిజన్‌లో మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరుగుతోంది. మొక్కజొన్న ఉత్పత్తులకు డిమాండ్ నెలకొనడంతో మద్దతు ధర బాగా వస్తోంది. దీంతో సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఎక్కువగా పత్తి సాగు చేసేవారు. ఆ పంట స్థానంలో నేడు మొక్కజొన్న పండిస్తున్నారు. – కె. రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ, పాలకొండ

రేషన్ కోసం వ్యయ ప్రయాసలు


రేషన్ బియ్యాన్ని ఇళ్లకు తీసుకెళ్లేందుకు ఆటోలో ఎక్కిస్తున్న జే.కే పాడు గ్రామానికి చెందిన మహిళలు

గుమ్మలక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ వాహనాలతో రేషన్ సరుకుల పంపిణీ విధానాన్ని నిలిపివేయడంతో కార్డుదారులకు రేషన్ బియ్యం ఇళ్లకు తీసుకెళ్లేందుకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. బుధవారం ఎల్విన్‌పేటలో డీఆర్ డిపో వద్ద అక్టోబర్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని డీలర్ పంపిణీ ప్రారంభించారు. పలువురు కార్డుదారులు వచ్చి తమ బియ్యాన్ని విడిపించుకొని ఇళ్లకు తరలించేందుకు మోతల యాతన పడ్డారు. కొందరేమో డిపో నుంచి రేషన్‌ను ఇళ్లకు తరలించేందుకు ఆటోలను కట్టించుకున్నారు. మరికొందరేమో మరొకర్ని సాయంగా తీసుకొచ్చి ద్విచక్ర వాహనాల్లో మూటలను ఎక్కించుకొని ఇళ్లకు తరలించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావని, ఇప్పుడేమో ప్రతీనెలా రేషన్ దుకాణానికి వచ్చి బియ్యం తీసుకెళ్లేందుకు వ్యయప్రయాసలు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ చోరీతో గద్దెనెక్కిన మోదీ

గుమ్మలక్ష్మీపురం: కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలో గల బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాసించేలా ప్రజల ఓట్లను దోచుకుని ముచ్చటగా మూడోసారి గద్దెనెక్కిందని, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడి లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ చోరీ చేయడం వలన నిజమైన ఓటర్లు వారికి నచ్చిన నాయకులను ఎన్నుకునే అధికారాన్ని కోల్పోయారన్నారు.

ఈ నేపథ్యంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్త ఉద్యమానికి పూనుకుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, కిల్లక లక్ష్మయ్య, ఆరిక ధర్మారావు, యువజన విభాగం నాయకుడు కోలక జయరాం, మహిళా విభాగం నాయకురాలు నిమ్మక పెంటమ్మ మన్నగు కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలించేస్తున్న వినోద పరికరాలు


పార్క్ నుంచి తరలించేస్తున్న వినోద పరికరాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్‌కే పాడు ఉద్యానవన నర్సరీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కల్చరల్ అడ్వంచర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల వినోద పరికరాలను పార్వతీపురం వెళ్లే ప్రధాన రహదారి పరిధిలోని ఐటీడీఏ పార్క్‌కు తరలించేస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఈ ప్రాంతంలోని గిరిజన నాయకులు, చిన్నారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని చిన్నారులకు ఆటవిడుపు కోసం ఏర్పాటు చేసిన వినోద పరికరాలను తరలించిస్తే చిన్నారులు ఎక్కడ ఆటలు ఆడుకోవాలని ప్రశ్నిస్తున్నారు. వినోద పరికరాలు చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవని, ఇంకా అభివృద్ధి చేస్తారేమోనని ఆశిస్తే ఆకస్మికంగా ఇక్కడ వినోద పరికరాలు తొలగించడం పట్ల గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పునరాలోచన చేయాలని గిరిజన సంఘ నాయకులు కోరుతున్నారు.

తెరిపివ్వని వర్షం


వీరఘట్టంలో కురుస్తున్న వర్షం

వీరఘట్టం: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రెండున్నర వరకు భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల వరకు విపరీతమైన ఎండతో కాసి ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడింది. దసరా సామగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజలు వర్షంతో ఇబ్బంది పడ్డారు.

వాచ్‌మన్ నిజాయితీ


సత్తిబాబు చేతుల మీదుగా బాధితునికి నాణేల మూటలు ఇప్పిస్తున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, సహసిబ్బంది

పాలకొండ రూరల్: తనకు దొరికిన నగదును బాధితుడికి అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న వాచ్‌మన్. వివరాల్లోకి వెళితే.. మారం కేశవరావు అనే వ్యక్తి రాజాం మండలం మెంతిపేట వెళ్లందుకే పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మంగళవారం రాత్రి చేరుకున్నాడు. బస్సు ఎక్కే క్రమంలో తన దగ్గర ఉన్న నగదు మూటలను కాంప్లెక్స్‌లో మరిచిపోయాడు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి (వాచ్‌మన్) బొమ్మాళి సత్తిబాబు మూటలతో ఉన్న నాణేనాలను గుర్తించి, ఆర్టీసీ డిపో భద్రతా విభాగంలో అప్పగించాడు. నగదు పోగొట్టుకున్న బాధితుడు బుధవారం ఉదయం పాలకొండ కాంప్లెక్స్‌కు చేరుకుని నగదు మూటల గురించి ఆరా తీయగా.. డిపో భద్రతా విభాగం సిబ్బంది విషయాన్ని ఆర్టీసీ జిల్లా రవాణాధికారి, ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావుకు తెలియజేశారు. బాధితుడు తగిన ఆధారాలు చూపించడంతో నగదు అందజేశారు. నాణేల సేకరణపై ఉన్న మక్కువతో బ్యాంక్‌లో రూ. 50 వేల నాణేలు తీసుకువస్తూ మర్చిపోయినట్లు బాధితుడు కేశవరావు తెలిపారు. నిజాయితీగా వ్యవహరించిన సత్తిబాబును బాధితుడితో పాటు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


పాలకొండ రూరల్: నక్కలపేటలో మహిసాసుర మర్దినిగా దర్శనమిస్తున అమ్మవారు


కురుపాం: రావాడ కూడలిలో మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చిన కురుపాం కోటదుర్గమ్మ


గరుగుబిల్లి: దుర్గమ్మ పూజలలో పాల్గొన్న భక్తులు

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని దుర్గాదేవి బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పాలకొండ, బత్తిలిలో ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కురుపాం, గరుగుబిల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన మంటపాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిపారు. – సాక్షి నెట్‌వర్క్


పాలకొండ రూరల్: గారమ్మ ఆలయ ప్రాంగణంలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


భామిని: బత్తిలిలో పవిత్ర జలాల ఘటాలతో ఊరేగుతున్న మహిళా భక్తులు

మాజీ ఉప ముఖ్యమంత్రి పరామర్శ


పెదబుడ్డిడిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాల సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు బుధవారం పరామర్శించారు. చినమేరంగిలోని రేగిడి అప్పలనరసమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పిప్పలబద్ర గ్రామంలో రౌతు సత్యంనాయుడు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెదబుడ్డిడి గ్రామంలో సీమల పెంటంనాయుడు, ఎత్తిలి చంటి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. గ్రామంలో ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన రేవళ్ల తాతబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్, నాయకులు లోలుగు నారాయణరావు, కెంగువ వెంకటనాయుడు, బలగ వెంకటరమణ, సీమల బాబూ భువన మోహనరావు, రేవళ్ల నారాయణరావు తదితరులున్నారు.

కురుపాంలో..


కురుపాం: శివ్వన్నపేటలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్య మంత్రి పుష్పశ్రీవాణి

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటకు చెందిన అద్దేపల్లి సూర్యనారాయణ ఈ మధ్య కాలంలో అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూర్యనారాయణ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యులు గొర్లి సుజాత, ఎంపీటీసీ సభ్యులు టి.వి.ఎస్.స్వామియాజులు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో ఆప్షన్ సభ్యులు జిలాని, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేయించండి


వెంకటరమణ, ఎంపీడీఓ

వీరఘట్టం: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నందున మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా పారిశుద్య పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆస్పత్రి జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాల్వలను వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారని, కాల్వలపై ఆక్రమణలను తొలగించాలని సూచించారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. పవిత్రోత్సవాలను అక్టోబర్ 2 నుంచి 5వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5న నాగావళి నది తీరంలో స్వామివారికి శ్రీచక్రస్నానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చినమేరంగిలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ


చినమేరంగి కోటలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు కోట రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి కోటలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోట రమేష్ బుధవారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను మాత్రమే టార్గెట్ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకే డిజిటల్ బుక్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, నాయకులు బలగ వెంకటరమణ, లోలుగు నారాయణరావు, కెంగువ వెంకటనాయుడు, ఆర్నిపల్లి వెంకటనాయుడు, మరడాన కిశోర్, తాడేల మన్మధ నాయుడు, తిరుపతినాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్


గుమ్మలక్ష్మీపురంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌లను విడుదల చేస్తున్న ఎంపీపీ దీనమయ్య తదితరులు

గుమ్మలక్ష్మీపురం: అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ ఈ క్యూ ఆర్ కోడ్‌లను ఎంపీపీ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ ప్రశ్నించే గొంతులపై అఘాయిత్యాలకు పాల్పడుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అధికార పార్టీ వారి ద్వారా దాడులు, అన్యాయం ఎదురైనా, అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఈ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఫోన్ ద్వారానే స్కాన్ చేసి ఫిర్యాదును అప్‌లోడ్ చేయాలని, అటువంటి ఫిర్యాదులపై తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విచారించి న్యాయం చేసేలా తమ అధినేత జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ విధానాన్ని అమల్లోకి తెచ్చారన్నారు.

వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, పార్టీ శ్రేణులు గోరిశెట్టి గిరిబాబు, తోయక గోపాల్, పసుపురెడ్డి మహేష్, నిమ్మక కృష్ణ తదితరులతో పాటు సర్పంచ్‌లు బొత్తాడ గౌరీశంకరరావు, ఆర్‌ఎస్ చైతన్య స్రవంతి, ఎం.జగ్గారావు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్రీయ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార నిర్వాహణపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉదయకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పాలిథిన్ ఉత్పత్తులు వినియోగిస్తే జరిమాన

సీతంపేట:

మెట్టుగూడ జలపాతం వద్ద పాలిథిన్ ఉత్పత్తులు వినియోగిస్తే జరిమాన తప్పదని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జలపాతం వద్ద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ రహిత జలపాతంగా తీర్చిదిద్దనున్న నేపథ్యంలో ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పాలథిన్ సంచులు పూర్తిగా నిషేధించామన్నారు. జలపాతానికి వచ్చేవారు షాంపులు కూడా వినియోగించకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 500 జరిమాన తప్పదన్నారు.


మెట్టుగూడ జలపాతం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు